అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గాలు కృషి చేయాలి



నాగారంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

కీసర: పురపాలక సంఘాలను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు మున్సిపల్ పాలకవర్గ సభ్యులంతా సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారంలోని 7వ వార్డులో సుమారు రూ. 39 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ఆయన మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, స్థానిక కౌన్సిలర్ గూడురు సబితాంజనేయులుగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపట్టేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ నిధులు, మున్సిపల్ స్వంత నిధులతో ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అభివృద్ధి పనులు చేపట్టాలని మున్సిపల్ పాలకవర్గం సభ్యులకు సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ గూడురు సబిత ఆంజనేయులుగౌడ్, కౌకుట్ల అనంతరెడ్డి, నేతలు మోకు జగన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అన్నంరాజు శ్రీనివాస్, నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'వరి పంటకు నత్రజని ఎరువులను వినియోగించొద్దు'

- పొటాష్‌ను వినియోగిస్తే చీడపీడలకు చెక్
- రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన



కొర్రెములలో పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పోచారం: కొర్రెములలో వరి పొలాలను రాజేంద్రనగర్‌లోని రైతు శిక్షణ కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. పంటను కాండం తొలిచే పురుగు, బ్యాక్టీరియల్ లీఫ్ బ్లెట్ అనే చీడపీడలు పాడుచేస్తున్నట్లు గుర్తించారు. రైతులు నత్రజని ఎరువులను వినియోగించవద్దని, పొటాష్‌ను ఎకరాకు 15 నుంచి 20 కిలోలు తప్పకుండా వాడాలని సూచించారు. అలాగే ఎకరాకు 400 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్‌తో పాటు 80 గ్రాముల స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ కలిపి పిచికారి చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కాంతి, కృష్ణవేణి, రాకేష్, ఏఈఓ మంజుల, రైతులు శ్రీశైలం, బాలరాజ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మేడ్చల్ అభివృద్ధికి పటిష్ట ప్రణాళిక



పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపిక

మేడ్చల్: మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని అత్వెల్లి రెండవ వార్డులో రూ. 11.50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి కౌన్సిలర్ సరిత మల్లేష్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అన్ని వార్డులలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. పలు ప్రాంతాల్లో ఆయా పనులు చురుకుగా సాగుతున్నాయని అన్నారు.కమిషనర్ నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొండల్‌రెడ్డి, మాణిక్య రెడ్డి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మేడ్చల్: డబీల్‌పూర్ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 112(పార్ట్)113(పార్ట్)లలో అక్రమంగా పేపర్ పై లేఅవుట్ చేసి 29 ప్లాట్లుగా మార్చి విక్రయాలకు పాల్పడటానికి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ప్రహరీతోపాటు ఇతర నిర్మాణాలను డబీల్‌పూర్ పంచాయతీ అధికారులు కూల్చివేశారు. మంగళవారం అక్రమార్కులు నిర్మాణాలు చేయడంతో అదే రోజు అధికారులు నిర్మాణాలను నిలిపివేయించగా బుధ, గురువారాల్లో యథేచ్ఛగా కొంత మంది అండతో నిర్మించారు విషయంపై అధికారులకు తెలియడం, పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో గ్రామ కార్యదర్శి ఉమాదేవి తన బృందంతో శుక్రవారం నిర్మాణాలతోపాటు ప్రహరీని కూల్చివేయించారు.



కమ్యూనిస్టులతోనే పేదలకు న్యాయం



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి సబిత

పోచారం: కమ్యూనిస్టులతోనే పేదలకు సమాజంలో న్యాయం జరుగుతుందని సీపీఎం మండల కార్యదర్శి సబిత అన్నారు. శుక్రవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో సీపీఎం మండల శాఖ వార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మతోన్మాద కార్పొరేట్ విధానాలను ప్రతిఘటించాల్సిన అవశ్యత గురించి వివరించారు. కమ్యూనిస్టులతోనే సామాన్య జనులకు సమాజంలో న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అలివేలు, నాగమణి, అరుణ, శోభ, సాయమ్మ, రాజిరెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరెడ్‌మెట్‌లో పోషణ మాసోత్సవం



నేరెడ్‌మెట్‌లో పోషణ మాసోత్సవంలో మర్రి రాజశేఖర్‌రెడ్డి


అల్వాల్: అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులు, బాలింతలకు సరైన సలహాలు, సూచనలు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ అల్వాల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి, అల్వాల్ సెక్టార్ మాసోత్సవం శుక్రవారం నేరెడ్‌మెట్‌లోని జీకె.సరస్వతి ఫంక్షన్‌హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో స్వాతి, కార్పొరేటర్లు సబిత అనిల్‌కిషోర్, మీనా ఉపేందర్‌రెడ్డి, మేకల సునీత రాముయాదవ్, మాజీ కార్పొరేటర్ శ్రీదేవి, నాయకులు రావుల అంజయ్య, పరుశురామ్‌రెడ్డి, హన్మంతరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదిని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

మల్కాజిగిరి: న్యాయవాదిని బెదిరించిన వ్యక్తిపై మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ గణేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం... మౌలాలి హనుమాన్‌నగర్‌లో దయానంద్ అలియాస్ దేవ న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. భూ వివాదానికి సంబంధించి అనూష కేసును దయానంద్ వాదిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీ రాత్రి దయానంద్ ఆఫీస్ కార్యాలయంలోకి సంతోష్ (అనూషతో వివాదం ఉన్న వ్యక్తి) అనుచరులతో చొరబడి దయానంద్‌తో పాటు అతని సోదరుని చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ సంఘటనపై దయానంద్ శుక్రవారం తోటి న్యాయవాదులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటకెక్కిన ఆరోగ్య కేంద్రాల నిర్వహణ?

- నిధుల కొరతతో కునారిల్లుతున్న హెల్త్ సెంటర్లు
- పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల నిర్వహణకు హెచ్‌డీఎస్ కింద ఏటా రూ. 1.75 లక్షలకు బ్రేక్
- ఏడాదికి జిల్లాలోని 38 ఆరోగ్య కేంద్రాలకు రావలసిన నిధులు రూ. 66.55 లక్షలు
- 2 ఏళ్లుగా నిధులు రాకపోవటం రోగులకు తప్పని ఇబ్బందులు



సాక్షి, సిటీబ్యూరో: రెండేళ్లుగా నిధుల లేమితో జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ ఆటకెక్కింది. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు ప్రతి ఏటా హెచ్‌డీఎస్ (హాస్పిటల్ డెవలప్ మెంట్ సొసైటీ) ద్వారా ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ. 1.75 లక్షలు అందజేసేది. ఈ నిధులు రెండేళ్లుగా విడుదల కాక పోవటంతో ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహణ లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 38 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇందులో 26 యూపీహెచ్‌సీలు ఉండగా, పీహెచ్‌సీలు 12 ఉన్నాయి. వీటిలో 8 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు రోగులకు 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నాయి. ఈ ఆరోగ్య కేంద్రాలన్నింటిలోనూ నిధుల లేమితో నిర్వహణ అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. ముఖ్యంగా ఆస్పత్రికి వచ్చే రోగులకు కనీస వసతులు కల్పించలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఇన్‌పేషంట్లకు తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల వసతి కల్పించలేని దుస్థితి ఏర్పడుతోంది. ఇటీవల కలెక్టర్ పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మూత్రశాల, మరుగు దొడ్లను పరిశీలించారు. హెచ్‌డీఎస్ (హాస్పిటల్ డెవలప్ మెంట్ సొసైటీ) నిధులు రావటం లేదనేనెపంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహణ సక్రమంగా లేదని తెలుసుకున్నారు.

కలెక్టర్ అసంతృప్తి...

ఆరోగ్య కేంద్రాల నిర్వహణ తీరుపై జిల్లా వైద్యాధికారిని ఆరా తీసిన కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి ఇలాగే ఉందనడంలో అతిశయోక్తిలేదు. వివిధ రకాల పరీక్షల కోసం బయటికి రాస్తుండటంతో ఇక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండీ లాభమేంటనే ప్రశ్నలు పలువురి నుంచి ఉత్పన్నమవుతున్నాయి.

- హెచ్ఎఎస్ నిధులు విడుదల కాకపోవటం వల్లనే ఆరోగ్య కేంద్రాల నిర్వహణ కష్టమవుతోంది. దీనిని గుర్తించిన కలెక్టర్ తన నిధి నుంచి తక్షణమే ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు నిధులను విడుదల చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నారు.
- ఈ విషయమై పీహెచ్‌సీల వైద్యాధికారులు మాట్లాడుతూ... ప్రభుత్వం నుంచి నిర్వహణ నిధులు రావటం లేదని పేర్కొంటున్నారు. ఇవే కాకుండా ఇతర పథకాలకు సంబంధించిన నిధులు కూడా విడుదల కాలేదంటున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.
- నిర్వహణ నిధులు విడుదల రాగానే సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కనీస వసతుల పరంగా ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని పేర్కొంటున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా ఘట్‌కేసర్ 33/11కేవీ సబ్‌స్టేషన్ ఎన్ఎఫ్‌సీనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఘట్‌కేసర్ ఏఈ సతీశ్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి 11. 30 గంటల వరకు అంబేద్కర్‌నగర్, ఐస్‌క్రీం కంపెనీ, లక్కీ వైన్స్ వెనుక వైపు విద్యుత్ ఉండదని ఆయన వివరించారు.

ఎల్లంపేట్ ఫీడర్ పరిధిలో...

మేడ్చల్: అత్వెల్లి సబ్ స్టేషన్‌లోని ఎల్లంపేట్ ఫీడర్ పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని రూరల్ ఏఈ పవన్‌చంద్ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకుఎల్లంపేట్, అత్వెల్లి, రెండు గ్రామాల పరిధిలోని పరిశ్రమలకు విద్యుత్ ఉండదని ఏఈ వివరించారు.

అభివృద్ధి పనులకు రూ. 31.50 లక్షలు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ. 31.50 లక్షల నిధులు కేటాయించేందుకు పాలవ వర్గం ఆమోదం తెలిపింది. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో పలు అభివృద్ధి పనులపై సభ్యులు చర్చించారు. అనంతరం నిధుల కేటాయింపునకు కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మేడ్చల్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ... మండలంలోని రాజబొల్లారం తండా సమీపంలో ఓ వ్యక్తి టాటాఏసీ వాహనంలో 22 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఓటీ పోలీసులు పట్టుకుని రేషన్ బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని మేడ్చల్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూట్యూబర్‌పై కేసు నమోదు

ఉప్పల్: పోలీసులపై అనుచిత వ్యాఖ్యలతో రీల్స్ చేసిన యూట్యూబర్‌పై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి వెల్లడించారు. చిలుకానగర్‌కు చెందిన యూట్యూబర్ బల్‌వీర్ సింగ్(27) తన ఇద్దరు స్నేహితులతో కలిసి ప్రముఖ డియో కంపెనీపై కేసు పెడుతున్నట్లు రీల్స్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతకు నడుం బిగిద్దాం

బోడుప్పల్: స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిసరాల పరిశుభ్రతకు నడుం బిగిద్దామని బోడుప్పల్ కమిషనర్ జీ.రామలింగం పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 2, 12, 13, 23 డివిజన్‌ల్లో ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్, కార్పొరేటర్లు బొమ్మక్ కల్యాణ్‌కుమార్, దానగల్ల అనిత యాదగిరి, రాసాల వెంకటేశ్‌యాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- దోమల నివారణపై అవగాహన కల్పించాలి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘునాథ్ స్వామి



సాక్షి, సిటీబ్యూరో: వర్షా కాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ముఖ్యంగా డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్యులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్య కార్యాలయం హాలులో వైద్యులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దోమల నివారణకు తగిన చర్యలతోపాటు ప్రజలకు అవగాహనతో కూడిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రతి ఒక్క ఆరోగ్య కేంద్రాలలో వాక్సిన్, మందులు, ఫ్లూయిడ్స్, యాంటీ స్నేక్, యాంటీ రేబిస్ ఇంజెక్షన్లు తగు మోతాదులో ప్రజలకు ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా బస్తీ,పల్లె దవాఖానాలను సందర్శించేలా ప్రోత్సహించాలన్నారు. ఇమ్యునైజేషన్, మాతా ఆరోగ్య సేవల బలోపేతం చేయాలన్నారు. బర్త్ ప్లానింగ్‌తోపాటు టి.డయాగ్నోస్టిక్స్ సేవలు ఆస్పత్రులలో నిర్వహించాలని ఆదేశించారు. వైద్యాధికారులు, సిబ్బంది అలసత్వం వదిలి ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదని, కఠినమైన చర్యలు తప్పవని సిబ్బందిని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య, ఆరోగ్య అధికారులు, డాక్టర్ శోభారాణి, డాక్టర్ సత్యవతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సరస్వతి, డాక్టర్ గీత, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ కౌశిక్, డాక్టర్ వెంకట్ నరేష్, మంజులారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఘట్‌కేసర్: పట్టణంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 68వ పాఠశాల క్రీడా సమాఖ్య జోన్ స్థాయి టోర్నమెంట్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అండర్-14, 17 విభాగాల్లో క్రీడాకారులకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మండల విద్యాధికారి రామారావు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ రాఘవేంద్రరెడ్డి మచ్చ, జెడ్పీ బాలుర పాఠశాల హెచ్ఎం పాపిరెడ్డి హాజరై క్రీడలు ప్రారంభించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సీతూగుప్త పూరి, డైరెక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి, రాధికారెడ్డి, జోన్ సెక్రటరీ శ్రీరాములు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



బావపై బామ్మరిది కత్తితో దాడి

- సోదరిని ప్రేమ వివాహం చేసుకున్నాడని కక్ష పెంచుకున్న యువకుడు
- అదను చూసి బావపై కత్తితో దాడి
- నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు



నిందితుడు మహేశ్

ఘట్‌కేసర్: బావపై బామ్మరిది కత్తితో దాడి చేసిన సంఘటన ఘట్‌కేసర్‌లో గురువారం అర్ధరాత్రి నిర్వహించిన గణేశ్ నిమజ్జనంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... ఈడబ్ల్యూఎస్ కాలనీలోని డైమాండ్ యూత్ వినాయక నిమజ్జనం శోభాయాత్రలో సాయి అలియాస్ మోక్షయాదవ్ డీజేను ఆపరేట్ చేశాడు. తన సోదరిని సాయి ప్రేమ వివాహం చేసుకున్నాడని అతడి బావమరిది మహేశ్ అలియాస్ మహేందర్(25) అతడిపై కక్ష పెంచుకున్నాడు. అదను చూసుకొని శోభాయాత్రలో డీజే ఆపరేట్ చేస్తుండగా వెనక నుంచి వచ్చి సాయిపై కత్తితో పొడిచాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడు సాయిని కీసరలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. నిందితుడు మహేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా సోదరి మానసను సాయి ప్రేమ వివాహం చేసుకున్నాడనే కక్ష పెంచుకున్న మహేశ్ శోభాయాత్రలో దాడి చేశాడు. బాధితుడు సాయి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు మహేశ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

వివాహిత మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి



మేడిపల్లి: మా కుమార్తె మృతికి కారణమైన వారిని అరెస్టు కఠినంగా శిక్షించాలని మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. బోయిగూడకు చెందిన చింతల అరుణ(29), పెద్దపల్లికి చెందిన రాజేష్‌తో ఐదు నెలల క్రితం వివాహం జరిగింది. వారు బోడుప్పల్ ఆర్ఎన్ఎస్ కాలనీలో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి భర్త ఇంటో లేని సమయం అరుణ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. తమ కూతురిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని శుక్రవారం పోస్టుమార్టం అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు మృత దేహంతో ధర్నా చేశారు. అరుణ మృతికి కారణమైన భర్త రాజేష్, అత్తామామ, ఆడపడుచులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

29 వరకు కుక్కలకు టీకాలు



కుక్కలకు టీకాలు ఇప్పిస్తున్న చైర్ పర్సన్ ప్రణీత

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో కుక్కకాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 409 కుక్కలకు టీకాలు వేశారు. బ్లూ క్రాస్ వెటర్నరీ బృందంచే స్పెషల్ డ్రైవ్ కింద కుక్కలకు టీకాలను ఈ నెల 29వ తేదీ వరకు ఇస్తున్నట్లు చైర్ పర్సన్ చెప్పారు. కుక్కలకు టీకాలు ఇప్పిస్తే ప్రమాదవశాత్తు కరిచినా రేబిస్ సోకదన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెఉడ్డి, కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు వసుపతి రమేష్, రామారం శ్రీహరి, ఆర్ఎస్‌కే కుమారి, వైద్య బృందం, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని మూడో వార్డులో రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్య, స్థానిక కౌన్సిలర్ సంగీతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీటీ రోడ్డు పనులు పెండిగ్‌లో ఉన్నందున ఇబ్బందులు తతెత్తుతున్నాయన్నారు. స్థానికుల విన్నపం మేరకు ఆ పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

'అమ్మ-నాన్న' అనాథాశ్రమ సేవలు భేష్



కేక్ కట్ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజు

పోచారం: అన్నానగర్‌లోని అమ్మా నాన్న అనాథ సేవా ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పోచారం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సేవా భావంతో అనాథాశ్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జునరెడ్డి, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డీఎం రవిప్రసాద్, బీజేహెచ్‌పీఎస్‌టీఎస్ జాతీయ వ్యవస్థాపకులు శ్రీగిరి మన్యం, అమ్మా నాన్న సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు గగనం సాయి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో సీసీ రోడ్డు పనులకు చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 11వ వార్డులో రూ. 20 లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సహకరించండి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సహకరించాలని కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. ఓల్డ్ మల్కాజిగిరి బొడ్రాయి సమీపంలో వీధిలో చెత్త వేసే పాయింట్‌ను ఆయన డీసీ రాజు, ఎఎంహెచ్‌ఓ డాక్టర్ మంజులతో కలిసి పరిశీలించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ ఇంటింటికి వచ్చే చెత్తబండ్లలో మాత్రమే చెత్త వేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేసే వారిపై నిఘా ఉంచి జరిమానా విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఎ గిరి, ఉపేందర్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి

అల్వాల్: మచ్చబొల్లారం, న్యూబొల్లారం కాలనీలో డ్రైనేజీ, రోడ్డు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ అసోసియేషన్‌వాసులు శుక్రవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ని కలిసి వినతిపత్రం అందచేశారు. దీనిపై ఈటల రాజేందర్ స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వాసులు కందుకూరి కరుణశ్రీ, మాచర్ల శ్రీనివాస్, అనురాధ, ఉదయ ప్రకాష్, దయాకర్, రాఘవేంద్రచారి, రమాకాంత్, పన్నాల రాజరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

నగరంలో భారీ వాహనాలకు నిబంధనలు విధించాలి

మల్లాపూర్: నగరంలో భారీ వాహనాల మూలంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలంగాణ ఆటోమోటార్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య అన్నారు. భారీ వాహనాల రాకపోకలపై నగరంలో నిబంధనలు విధిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. నగరంలో భారీ వాహనాలపై నిబంధనలు విధించాలని శుక్రవారం రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడుతూ.. భారీ వాహనాల మూలంగా హబ్సిగూడ చౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పదో తరగతి చిన్నారి ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ప్రమాదాలు ఎక్కువగా ఉదయం, సాయంత్రం వేళల్లో జరుగుతున్నాయని, ఈ సమయాల్లో స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర కార్యకలాపాలపై వెళ్లే వారు ఎక్కువగా ఉంటారని, అదే సమయంలో భారీ వాహనాలు తిరుగుతుండటం వల్ల ప్రమాదాల బారినపడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్, కాలేజీ, ఆఫీస్ ప్రారంభం, ముగింపు సమయాల్లో భారీ వాహనాలను అనుమతించకుండా నిబంధనలు విధించాలని కోరారు.